# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-10-2023** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా ఆ మహనీయులకు దేశ వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు.**

**2. మహాత్ముడు ప్రవచించిన సత్యం, అహింసా సిద్ధాంతాలు ప్రపంచానికి నూతన మార్గం చూపాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.**

**3. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14 నుండి 24వ తేదీ వరకు పాఠశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది.**

**4. స్కిల్ డెవలప్మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ శ్రేణులు ఒకరోజు నిరాహార దీక్ష చేపడుతున్నాయి.**

**5. జీఎస్టీ వసూళ్ళు గత నెలలో 1.62 లక్షల కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి.**

==========================

ఈ రోజు జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా యావత్ భారతదేశ ప్రజలు ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పిస్తూ... ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను స్మరించుకుంటూన్నారు. దేశవ్యాప్తంగా ఈ సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి... మహాత్ముని విగ్రహానికి, చిత్ర పటాలకు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత రాయబార కార్యాలయాల్లో కూడా మహాత్మునికి నివాళులర్పిస్తూ... ఆయన ప్రవచించిన సత్యం, అహింసా, పరిశుభ్రత వంటి సిద్ధాంతాలను స్మరించుకుంటున్నారు. ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముని సమాధి చెంత ఈ సందర్భంగా సర్వమత ప్రార్ధనలు జరిగాయి.

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధంకడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు హర్‌దీప్ సింగ్ పూరి, డాక్టర్ జితేంద్ర సింగ్, మీనాక్షి లేఖి, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే తదితరులు మహాత్ముని సమాధిని సందర్శించి... పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళు లర్పించారు. కాగా... సత్యం, అహింసా వంటి మహాత్ముని సిద్ధాంతాలు ప్రపంచానికి నూతన మార్గం చూపాయని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమం సందర్భంగా మహాత్ముడు చేసిన బోధనలు... ప్రతి ఒక్కరినీ ఉత్తేజితులను చేశాయని... చరిత్రగతిని మార్చివేశాయని రాష్ట్రపతి పేర్కొన్నారు.

బాపూ అడుగుజాడలలో నడవాలని మనందరం ప్రతిన పూనుదామని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ తన సందేశంలో పిలుపునిచ్చారు. మహాత్ముని బోధనలు మనకు నిరంతరం వెలుగు చూపుతున్నాయని

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గాంధీ ప్రభావం ప్రపంచ మానవాళిపై గణనీయమైన ప్రభావం చూపుతోందని... ఆయన సిద్ధాంతాలు, ఆలోచనా ధోరణి శాంతి సామరస్యాల సాధన దిశగా యువతకు మార్గం చూపుతున్నాయని కూడా ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఇలాఉండగా...జై జవాన్–జై కిసాన్ నినాదంతో దేశ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించి దేశాభివృద్ధికి అనేక విధాలుగా సేవలు అందించిన మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కూడా దేశ ప్రజలు ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని విజయ్ ఘాట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి సమాధిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందర్శించి పుష్ప గుచ్ఛాలు ఉంచి.. నివాళులర్పించారు. లాల్ బహదూర్ శాస్త్రి ఎంతో చిత్తశుద్ధితో దేశానికి అందించిన సేవలు, ఆయన సాదా సీదా జీవితం ప్రస్తుత తరాలకు మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా మార్గదర్శనంగా నిలుస్తాయని నరేంద్రమోదీ తన సందేశంలో పేర్కొన్నారు. మరొక వైపు... మహాత్మాగాంధీ జయంతిని ఈ రోజు అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా కూడా నిర్వహిస్తున్నారు.

---------------------------

మహాత్మాగాంధీ త్యాగం, బోధనలు... భరత జాతికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గాంధీ అనుసరించిన శాంతియుత నిరసనలను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు అనుసరించారని... నాయకులకు ఇవి ప్రేరణగా కూడా నిలిచాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధి అడుగుజాడల్లో నడుస్తూ సత్యం, అహింసా మార్గాలను పాటించేందుకు మనలను మనం పునరంకితం చేసుకుందామని అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.

కాగా... మహాత్మా గాంధీ బోధనలను ఆదర్శంగా తీసుకుని... రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన చేస్తున్నామని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ట్విట్టర్ మాధ్యమంలో పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు ద్వారా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేశామని... భవిష్యత్‌లో కూడా మహాత్ముని మార్గంలోనే పయనిస్తామని ముఖ్యమంత్రి అన్నారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తిరుపతిలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని... గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మగాంధి పోరాటంతోనే మనకు స్వాతంత్ర్యం లభించిందని ఆయన పేర్కొన్నారు.

ఈరోజు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని గాంధీ హిల్‌తో పాటు పలు ప్రాంతాల్లో శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ బోర్డు సభ్యులు మల్లాది విష్ణు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒంగోలులో జరిగిన గాంధీ జయంతి కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా... శ్రీకాకుళంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు.

గుంటూరులో జరిగిన గాంధీ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

---------------------------

ఒక్క అడుగు స్వచ్ఛతవైపు అంటూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మహోద్యమంలా సాగుతోంది. 2014 అక్టోబర్ 2వ తేదీన ప్రారంభమైన స్వచ్ఛ భారత్ అభియాన్ భారత్‌ను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతోంది. గ్రామాలు, నగరాలు, పట్టణాలు, జిల్లాలు, రాష్ట్రాలు, విద్యా సంస్థలు స్వచ్ఛంగా రూపుదిద్దుకుంటూ పురస్కారాలను సైతం అందుకుంటున్నాయి.

స్వచ్ఛ భారత్ అభియాన్ 2.0, స్వచ్ఛతా హి సేవ, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలతో దేశం స్వచ్ఛత దిశగా పయనిస్తోంది. గాంధీ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆకాశవాణి విజయవాడ కేంద్ర సిబ్బంది, డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎం. సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆకాశవాణి ప్రాంగణంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం కింద పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు.

---------------------------

గాంధీ జయంతి సందర్భంగా కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం హింసాకాండకు పాల్పడుతున్నందుకు నిరసనగా మౌన దీక్ష చేపట్టారు. పవన్ కళ్యాణ్‌తో పాటు ఇతర పార్టీ శ్రేణులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

---------------------------

రాష్ట్రంలో పాఠశాలలకు ఈ నెల 14 నుండి 24వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. అనంతరం... ఈ నెల 25వ తేదీ నుండి తరగతులు పునఃప్రారంభం అవుతాయి. కాగా... రాష్ట్రంలో ఈ నెల 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు పాఠశాల విద్యా శాఖ ఫార్మేటివ్ అసెస్మెంట్-ఎఫ్.ఏ-2 పరీక్షలు నిర్వహించనుంది. అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుండి 10వ తేదీ వరకు విద్యార్థులకు నిర్దేశించిన సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి ప్రశ్నాపత్రం ఆధారంగా పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయి. ప్రశ్నా పత్రాలను పరీక్ష జరిగే ముందు రోజు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు పంపుతారు. 9, 10 తరగతుల విద్యార్థులకు రోజుకు రెండు పరీక్షలు ఉదయం సమయంలోనూ... 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం సమయంలోనూ పరీక్షలు జరుగుతాయి.

---------------------------

స్కిల్ డెవలప్మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును ప్రభుత్వం అరెస్టు చేసినందుకు నిరసనగా "సత్యమేవ జయతే" పేరుతో ఆ పార్టీ శ్రేణులు ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహిస్తున్నారు. ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ దీక్షలు సాయంకాలం 5 గంటలకు ముగుస్తాయి. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో చంద్రబాబు నాయుడు దీక్ష చేపడుతుండగా... ఆయన సతీమణి నారా భువనేశ్వరి రాజమహేంద్రవరం క్వారీ సెంటర్ వద్ద దీక్షలో కూర్చున్నారు.

మరొకవైపు... తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఢిల్లీలో నిరాహార దీక్ష చేస్తున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఇతర ముఖ్యనేతలు నిరసన దీక్ష పాటిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఆ పార్టీ శ్రేణుల నిరాహార దీక్ష

కొనసాగుతోంది. మరొకవైపు... హైదరాబాద్‌లో ఎన్.టి. రామారావు కుటుంబ సభ్యులు కూడా నిరాహార దీక్ష చేస్తున్నారు.

---------------------------

గత నెలలో వసూలైన వస్తు సేవల పన్ను-జీఎస్టీ వివరాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సెప్టెంబరు మాసంలో 1.62 లక్షల కోట్ల రూపాయల జీఎస్టీ వసూలైనట్టు ఒక ప్రకటనలో తెలిపింది. గతేడాది సెప్టెంబరుతో పోలిస్తే వసూళ్లలో 10 శాతం వృద్ధి నమోదైంది.

సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ 29 వేల 818 కోట్ల రూపాయలు కాగా... రాష్ట్ర ప్రభుత్వ జీఎస్టీ 37 వేల 657 కోట్ల రూపాయలు... సమీకృత జీఎస్టీ 83 వేల 623 కోట్ల రూపాయలు అని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి డి.శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

వాయిస్ - 35 సెకన్లు

=======================